


# జెలసీ

న్యాయపతి కమలారాంజీ

కథ రాద్దామని పెన్, పుస్తకం పట్టుక్కూర్చున్నాను. కథకి సబ్జెక్ట్‌కి ముందే ఎంచి పెట్టుకున్నాను. ప్లాటంతా మనసులోనే తయారయిపోయింది. ఇంట్లో ఒక్కర్తినీ ఉంటే భలే ఉత్సాహం వచ్చేస్తుంది నాకు. ఎంచక్కా నా కథల లోకంలో నేను విహరించ వచ్చు. అదీ నా ఉత్సాహానిక్కారణం! కలం కదులుతున్నది. అక్షరాలు పరుగెడుతున్నాయి. నాలుగు లైన్లు రాశానో లేదో కాలింగ్ బెల్ చప్పుడు వినిపించింది. గుండె గుభేలుమంది. నా ఏకాంతానికి అంతరాయం కలిగినందుకు బాధపడుతూ వెళ్ళి తలుపు తీశాను. ఎదురు ఫ్లాట్‌లోని కృష్ణవేణి ఆంటీ, "రండి కూర్చోండి" అన్నాను.

ఆవిడ నవ్వుతూ తన భారీకాయాన్ని మోసుకుంటూ వచ్చి సోఫాలో కూలబడింది.

"ఏం చేస్తున్నావు? కథ రాస్తున్నావా? నేను వచ్చి డిస్టర్బ్ చేసినట్టున్నాను" అంది.

"పర్లేదులెండి. చెప్పండి ఏంటీ విశేషాలు?"

వీధి గుమ్మం దాకా వెళ్ళి ఒకసారి అటు ఇటు చూసి వచ్చి "విశేషాలే! అందుకే నీ దగ్గరకు వచ్చాను, మాంచి సబ్జెక్ట్‌తో! అయినా ఇలాంటివాళ్ళని ఊరికే వదిలిపెట్టకూడదు. శుభ్రంగా దానిమీద ఒక కథ రాసి పడెయ్యి. దెబ్బకి దానికి బుద్ధి వస్తుంది".

నేను తెల్లబోయాను.

"ఎవరు ఆంటీ? ఎవరి మీద కథ రాయాలి నేను? అసలేంటి సంగతి?"

"మన ఫ్లోర్‌లోనే ఆ చివర వసంత లేదూ! అదే... దాని గురించి చెబితే కథేం ఖర్మ... ఒక పెద్ద నవలే రాసేయవచ్చు..." పదే పదే నవ్వుతూ అంది ఆవిడ.

"ఏమయింది చెప్పండి" అన్నాను కుతూహలంగా.

"వసంత అత్తగారు, మామగారు మొన్న రాత్రి ఊరికి వెళ్ళిపోయారు!"


"ఎవరి పని మీద వాళ్ళు వెళ్తూ ఉంటారు. అందుకు ఏముంది విశేషం!"

"వాళ్ళు పనిమీద వెళ్ళలేదు. ఆ వసంత ఉందే అది గెంటేసింది. వాళ్ళ అత్తగార్ని, మామగార్ని, వాళ్ళని అసలు ఎలా చూసుకోవాలి? నువ్వే చెప్పు.

స్వంత తల్లిదండ్రుల్లా చూసుకోవాలి. అలాంటిది వాళ్ళని సాధించుకుతింది. దాంతో వాళ్ళిద్దరూ ఏడ్చుకుంటూ వెళ్ళిపోయారు".

ఆవిడ కళ్ళతో చూసినట్టే వర్ణించి చెప్తున్నా నాకు నమ్మాలనిపించలేదు. అయినా ఊరుకున్నాను.

"ఆ వసంత సెంట్రల్ స్కూల్‌లో పనిచేస్తున్నాదన్న సంగతి నీకూ తెలుసు కదా! వాళ్ళాయన ఏదో ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడట. దానికంటే తక్కువ జీతం అట. ఆ కంపెనీ దివాలా తీసిందని, అతగాడి ఉద్యోగం ఊడిపోయిందని విన్నాను, ఇక దాంతో దాని జీతం మీదే వాళ్ళంతా ఆధారపడి బ్రతుకుతున్నారని, అదేదో మహా సామ్రాజ్యాన్ని ఏలుతున్న మహా రాణిలా పోజులు కొడుతున్నాది. ఇంటి పెత్తనమంతా దానిదేనట. పని మనిషిని మానిపించేసింది. ఇంట్లో ఇందరు ఉండగా పని మనిషి ఎందుకు దండగ అందట. ఫ్రిజ్‌లోంచి నాలుగే వంకాయలు తీసి బయట పెడుతుందట. దాంతోనే కూర చెయ్యమంటుంది. అత్తగారు, మామగారు టి.వి. చూడడానికి వీల్లేదు. దాని కొడుకు చదువుకి డిస్టర్బెన్స్ అట. వాళ్ళిద్దరూ రోజంతా ఇంట్లో ఉంటారు. వాళ్ళకెలా ఊసుపోతుంది? నువ్వే చెప్పు. ఏ వయసువాళ్ళయినా కష్టపడి ఒళ్ళొంచి పని చెయ్యాలని, అలా చేస్తేనే ఆరోగ్యంగా ఉంటారని, లేకపోతే సోమరిపోతులవుతారని అంటుందట. బయట పనులన్నీ మామగారు, ఇంటిపనులన్నీ అత్తగారు జీతం బత్తెం లేని నౌకర్లనుకుంటోందా? దాని గర్వం చూడు. కళ్ళు నెత్తికెక్కాయి దానికి. స్కూల్లో పదిమంది పిల్లలకి పాఠాలు చెప్పే టీచరు. అత్త మామల్ని స్వంత తల్లిదండ్రుల్లా చూసుకోవాలి. అలాంటిది వాళ్ళని ఇంట్లోంచి గెంటి వేసింది. ఆ వెట్టిచాకిరీ చెయ్యలేక పాపం వెళ్ళిపోయారు వాళ్ళు. దానికే న్యాయం ధర్మం లేనప్పుడు పిల్లలకి ఏం బోధిస్తుంది? అసలు దాని స్కూలు ప్రిన్సిపాల్‌కి దాని గురించి రిపోర్టివ్వాలి. అప్పటికిగాని దాని పొగరు అణగదు. నువ్వు అర్జెంటుగా ఆ వసంత మీద కథ రాసి ఏ పత్రికకైనా పంపించు. ఆ పత్రిక కాపీ ఒకటి దాని మొహాన కొడదాం. అప్పుడు దాని మొహం నల్లగా మాడిపోతుంది. చూడు..." అనర్గళంగా చెప్పి ఆయాసం వచ్చి ఆగింది కృష్ణవేణి.



నేను అంతా విన్నాను. నాకు తెల్సినంత వరకు వసంత చాలా మంచిది. వాళ్ళింట్లోంచి ఎప్పుడూ గట్టిగా అరుచుకుంటున్నట్టు మాట్లాడుకోవడంగానీ, దెబ్బలాడుకోవడంగానీ ఎప్పుడూ వినబడలేదు. వసంత మర్యాదస్తురాలు. సభ్యతా సంస్కారం ఉన్న మనిషి. అనవసరంగా ఎప్పుడూ ఎవరి మనసూ కష్టపెట్టదు. మరి ఈవిడేంటి ఇలా చెప్తున్నది! ఇందులో నిజం శాతం ఎంతుందో మరి?

"నీకు కథ రాయడానికి మంచి సబ్జెక్ట్ ఇచ్చాను కదూ!" నవ్వుతూ అంది ఆవిడ, నేనిచ్చిన కాఫీ తాగుతూ. నేను నవ్వి ఊరుకున్నాను.

"ఇదంతా నిజమేనంటారా?" ఒక్క నిమిషం తర్వాత అడిగాను.

"అయ్యో, వెర్రి పిల్లా! నీ కంటికి అందరూ మంచివాళ్ళలాగే కనిపిస్తారు. నీకే విషయం తెలుసా? పొద్దుట మిగిలిపోయిన అన్నం తను తినడమే కాకుండా అత్తగార్ని కూడా తినమంటుందట! ఎంత ఉద్యోగం వెలగబెడితే మటుకు పెద్దవాళ్ళన్న గౌరవం లేకుండా వాళ్ళనలాగేనా చూసేది? దాని మొహం మీద ఉమ్మేయాలి" కోపంగా చూసింది కృష్ణవేణి నా వైపు. ఈవిడకెందుకంత కోపం వసంత మీద? అసలు వాళ్ళ ఇంటి విషయాలు ఈవిడకెలా తెలుస్తున్నాయి?


"మీకెలా తెల్సు ఇవన్నీ?"

"వాళ్ళ పని మనిషి కనకం లేదూ... అది చెప్పింది".

"వాళ్ళకి పనిమనిషి లేదన్నారు!"

"ఈ మధ్య మళ్ళీ పెట్టుకుందిలే. ఆ కనకానికి టిఫిన్ పెట్టి ఇన్ని టీ నీళ్ళు పోస్తే చాలు చక్కగా అక్కడి విషయాలన్నీ ఇక్కడ చెప్తుంది. వాళ్ళ అత్తగారు దీంతో చెప్పుకుని ఏడ్చిందట!

"ఓహో! అదా సంగతి. పని మనిషి న్యూసన్న మాట ఇది. ఈ పని మనుషులు న్యూస్ ఏజెంట్లలాగా తయారవుతున్నారు. వాళ్ళకున్న మిడిమిడి జ్ఞానంతో ఎదుట జరుగుతున్నదానికి ఇంకేదో ఊహించేసి ఇంతకంత కలిపి న్యూస్‌లు లీక్ చేస్తూ ఉంటారు. అసలు ఏ అత్తగారైనా, "కోడలు కూడా కూతురు లాంటిదే" అనుకుంటే ఎలాంటి సమస్య రాదు. సమస్యల్ని భూతద్దంలోంచి చూస్తే పెద్దవిగా కనిపిస్తాయి. కొడుక్కి ఉద్యోగం లేదు. కోడలి ఒక్కర్తి సంపాదన మీదే ఐదుగురు బ్రతకాలి. అదీనూ ఇలాంటి సిటీస్‌లో అంటే మామూలు విషయం కాదు. ధరలన్నీ ఆకాశానికంటుతున్నాయి. బియ్యం కిలో ఇరవై రూపాయలు. ఈ రోజులబట్టి మనం కూడా కొంచెం సర్దుకుపోవాలి. ఆడపిల్ల ఒక్కర్తీ సంపాదించి ఇంతమందిని పోషిస్తున్నది అన్న ఇంగిత జ్ఞానం అత్తలకి ఉండాలి. పొద్దుట మిగిలిన అన్నం అనవసరంగా పారెయ్యకుండా ఇంట్లో అందరూ సర్దుకుపెట్టుకుతింటే ఎంతో మంచిది. లేదంటే ఆ అన్నంతో దద్దోజనం, పులిహోర లాంటివి చేసుకుతినొచ్చు. పనిమనిషి అవసరం లేదు. పనివాళ్ళకి వాళ్ళ పనిమీదకంటే ఇంట్లోవాళ్ళు మాట్లాడుకునే మాటలమీద ఎక్కువ శ్రద్ధ. మగాళ్ళు కూడా 'నేను మగాడ్ని' అని కాలు మీద కాలు వేసుకు కూర్చోకుండా ఎవరి పనులు వాళ్ళు చేసుకోవచ్చు. అత్త కోడళ్ళు కలిసి ఇంటి పనులు చేసుకోవచ్చు. ఇంటి గుట్టు రచ్చకీడ్చే అలాంటి పనివాళ్ళ కంటి మన ఇంటి పని మనం చేసుకోవడమే మంచిది. ఇంట్లో ఉన్నంతసేపూ వసంత పని చేస్తూనే ఉంటుంది. అవకాశం వచ్చినప్పుడల్లా అనవసరంగా దెప్పుడు మాటలు ఆడకుండా అర్థం చేసుకుని మసలుకుంటే



## తెలుగులో అమీర్‌ఖాన్ తమ్ముడు!

**బా**లీవుడ్ నటుడు అమీర్‌ఖాన్ తమ్ముడు ఫైసల్‌ఖాన్ తెలుగులో హీరోగా చేయబోతున్నాడట. ఇప్పటికే టి.వి.సీరియల్స్‌లో నటిస్తున్న ఈ నటుడు తెలుగు, హిందీ భాషల్లో నిర్మించబోయే సినిమా ద్వారా తెలుగు వెండితెరకు పరిచయం కాబోతున్నాడు.

అందరికీ ఎంతో బాగుంటుంది. సర్దుకుపోవడం అన్నది ఒక్క భార్యాభర్తల మధ్యనే కాదు, ఇంట్లో ఉండే సభ్యులందరి మధ్యా ఉండాలి. తల్లీ-కొడుకులు, తల్లీ-కూతుళ్ళు, అత్త-కోడలు, మామగారు-కోడలు... ఇలా అందరూ ఒకర్నొకరు అర్థం చేసుకుని, ఇంట్లోని పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకుని ఒకర్నొకరు వేలెత్తి చూపించుకోకుండా ప్రవర్తిస్తే ఎవరింట్లోనూ ఎలాంటి గొడవలు తలెత్తవు. ఇంటి విషయాలు ఇవతలకి వస్తున్నాయంటే ఇంట్లో ఎవరో ఒకరు కోపంతో, అజ్ఞానంతో తెలివి తక్కువ తనంతో ఇంటి విషయాల్ని బయట పెట్టుకోవడమే కారణం!" కృష్ణవేణి వెళ్ళిపోయాక నా ఆలోచనలు ఆ విధంగా సాగాయి.

కృష్ణవేణి ఆంటీ మాటలు నేను నమ్మలేదు. కాని నమ్మినట్టుగా నటించాను. ఈ కృష్ణవేణి తన కొడుక్కి పెళ్ళి చేసింది. చదువుకున్న పిల్ల, ఉద్యోగం చేసే పిల్ల అయితే చెప్పిన మాట వినదని, తన ఆటలు సాగవని చదువు సంధ్య లేని పల్లెటూరి మొద్దుపిల్లని బోలెడంత కట్నం పుచ్చుకుని కొడుక్కి కట్టబెట్టింది. కాని ఆ కొడుకు మనసు తెల్సుకోవాల్సిన అవసరం ఉందని ఆవిడ అనుకోలేదు. వాడు ఎప్పుడూ ఆఫీసు, కేంపులు అంటూ ఇంటికి రావడం మానుకున్నాడు. ఇంట్లో పెత్తనమంతా కృష్ణవేణిదే. ఆవిడ గీసిన గీత దాటదు కోడలు. కృష్ణవేణి టి.వి. చూస్తూ ఉంటే అక్కడికే వేడివేడిగా కాఫీలు, ఫలహారాలు అందిస్తుంది కోడలు. ఇంటి పనంతా కోడలే చేస్తుంది. అది మరి జీతంబత్తెం లేని నౌకరీ కదా? గురివింద గింజ తన కింద వున్న నలుపు ఎరగనట్టు ఎవరి స్వంత విషయాలు వాళ్ళు తెల్సుకోలేరు. కృష్ణవేణి ఒక్క పని కూడా చెయ్యదు. ఇక్కడ గ్లాసు తీసి అక్కడ పెట్టదు. ఆవిడ బట్టలు కూడా కోడలే ఉతికి, ఆరేసి, ఇస్త్రీ చేసి పెడుతుంది. ఆవిడకి రోజంతా ఖాళీయే. ఇంకొకరి ఇంటి విషయాలు తెల్సుకోవడమంటే ఆవిడ చెవి కోసుకుంటుంది. అందరిళ్ళకి వెళ్ళి ఆరాలు తీసి దానికి ఉన్నవి లేనివి కల్పించి మరీ చెప్తుంది. పొరుగింటి కయ్యం చూడ వేడుక! వీధి తలుపు తీసే ఉంది. ఇంతలో వసంత అత్తగారు, మామగారు గుమ్మం ముందు నుంచి వెళ్తూ కనిపించారు. వాళ్ళు వచ్చేశారు. వాళ్ళసలు ఎందుకు వెళ్ళారో, ఎక్కడికి వెళ్ళారో? కోడలు గెంటిస్తే వెళ్ళారో, ఏదైనా పనుండి వెళ్ళారో... ఇవన్నీ ఆలోచించరేం ఎవ్వరూనూ? ఇతరుల మీద బురద జల్లడానికి ఎందుకంత ఉత్సాహం చూపిస్తారు వీళ్ళంతా? మొత్తానికి వాళ్ళు తిరిగి వచ్చేసినందుకు నాకు చాలా హ్యాపీగా ఉంది.

మర్నాడు కృష్ణవేణి మళ్ళీ వచ్చింది.

"ఏవమ్మా, రాశావా? నువ్వు తొందరగా రాయి. నువ్వు రాయాలి. అది పత్రికలో అచ్చు కావాలి. అది చూసి నేను సంతోషించాలి. ఆ పత్రిక కాపీ ఒకటి ఆ వసంత ముఖం మీద కొట్టాలి. అది చదివి నిప్పులో కాలిన వంకాయలా దాని ముఖం నల్లగా మాడి చావాలి." అక్కసుగా అంది ఆంటీ.

"వసంత అత్తగారు, మామగారు వచ్చేశారండీ..." కూల్‌గా అన్నాను.


"ఆఁ... వచ్చేశారా?" ఒక్క నిమిషం ముఖం తెల్లముఖం వేసింది ఆవిడ. తర్వాత తేరుకుని, "ఆఁ ఏం వచ్చేయడంలే. చూస్తూండు వాళ్ళు మళ్ళీ వెళ్ళిపోతారు! ఆ వగలాడి వంకాయతో వేగడం మహాకష్టం" అంది సాగదీస్తూ.

ఆంటీకి వసంత మీద ఎందుకంత కోపం? ఆవిడ ఉద్దేశం ఏమిటి? వసంతని చెడ్డదానిగా చిత్రీకరిస్తే ఆవిడకొచ్చే లాభం ఏమిటి? నా మనసు పరిపరి విధాల ఆలోచించసాగింది. తర్వాత కొన్ని రోజులకి అసలు విషయం తెల్సింది.

తన కోడలు పల్లెటూరిది. మొద్దుది. చదువు లేనిది. పైగా అందచందాలు శూన్యం. తన కోడలిలా కాకుండా, వసంత చదువుకుని ఉద్యోగం చేస్తూ అత్తమామల్ని ఆదుకుంటున్నది. వాళ్ళందరూ హాయిగా సుఖంగా ఉన్నారు. ఎలాంటి మనస్పర్థలు, విభేదాలు లేకుండా కలిసి మెలిసి ఉంటున్నారు. అదే కడుపు మంట ఆంటీకి. ఆవిడ కళ్ళు పచ్చబడ్డాయి. ఓర్వలేక పోయింది. పైగా వసంత చక్కగా ఉంటుంది. కాలం విలువ తెలుసు ఆమెకి. ఆంటీ లాంటి పనీపాటా లేని వాళ్ళతో సొల్లు కబుర్లు వేసుకూర్చోదు. కృష్ణవేణి ఆంటీ, వసంత వాళ్ళింటికి మాటిమాటికీ వెళ్ళి అత్తగారిమీద కోడలికి, కోడలి మీద అత్తగారికి చాడీలు చెప్పేది. చూసి చూసి ఒక రోజు వసంత, "మీరు పెద్దవారు. ఇలా లేనిపోనివి చెప్పి మనసులు పాడుచెయ్యడానికి మీకు సిగ్గనిపించడంలేదూ? మీరు మా ఇంటికి రాకండి. మీ పనేదో మీరు చూసుకోండి..." అని ముఖం మీదే చెప్పేసింది. అదిగో అప్పట్నుంచి ఆంటీకి వసంత మీద కోపం, ఈర్ష్య, ద్వేషం. అది ఈ విధంగా తీర్చుకుంటున్నది. ఆవిడ మా ఇంటికి వచ్చి వసంతమీద కథ రాయమని చాలా సార్లు చెప్పింది. ఎవరిగురించి కథరాయాలో తేల్చుకోలేక నిర్లిప్తంగా ఉండిపోయాను నేను. తర్వాత కొన్ని రోజులకి భర్త నిర్లక్ష్య వైఖరి, అత్తగారి సాధింపులు భరించలేక కృష్ణవేణి ఆంటీ కోడలు పుట్టింటికి వెళ్ళిపోయింది. మరి వచ్చే ఉద్దేశ్యం లేదని, విడాకుల నోటీసు పంపిస్తూ, పెళ్ళిలో వాళ్ళిచ్చిన కట్నం తిరిగి ఇచ్చెయ్యమని కోర్టు ద్వారా శ్రీముఖం పంపించారని తెలిసింది నాకు.

ఎవరి గురించి కథ రాయాలో ఇప్పుడు నిర్ణయించుకున్నాను. ❀

## బాలకృష్ణ నర్తనశాల!



బాలకృష్ణ హీరోగా తెలుగులోకి 'నర్తనశాల' రాబోతోంది. ఇమేజ్‌కి తగ్గ సినిమాలు తీస్తున్నా, 'మరిన్ని పౌరాణిక చిత్రాల్లో చేయాలనుంది' అంటూ ఆ చిత్రాలపై వున్న ఆసక్తిని తెలియబరుస్తూ వచ్చారు బాలకృష్ణ. బాలకృష్ణతో పాటు హరికృష్ణ, ఉదయ కిరణ్‌లు కూడా ఈ చిత్రంలో నటించబోతున్నారు. పౌరాణిక చిత్రాల్లో సాటిలేని నటుడిగా వెలుగొందిన ఎన్.టి.ఆర్. వారసులిద్దరూ నటిస్తున్న ఈ చిత్రంపై భారీగా అంచనాలున్నాయి.

